# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దేశంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు 8 కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.
2. ఆంధ్రప్రదేశ్ లోని గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ తెలిపారు.
3. కూటమి ప్రభుత్వంలో ఏపీఎస్ఆర్టీసీకి పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.
4. తెలంగాణను ఇకపై ఫ్యూచర్ స్టేట్ భవిష్యత్తు రాష్ట్రం అనే ఉపశీర్షికతో పిలవాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు.
5. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతం 'మా తెలుగు తల్లి.." రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి ఈరోజు.

==========================

దేశంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు 8 కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. నిన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం సమావేశమైంది. ఈ సమావేశ నిర్ణయాలను నిన్న ఢిల్లీలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వివరించారు. దేశంలో 24,657 కోట్ల అంచనా వ్యయంతో 8 కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులను నిర్మించనున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రవాణా సంబంధిత మౌలిక సదుపాయాలకు ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి పేర్కొంటూ..

...వాయిస్ ..

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ ఆదేశించారు. నిన్న అమరావతిలో ఆయన మాట్లాడుతూ, వేడుకల నిర్వహణ కోసం పంచాయతీలకు నిధులు కేటాయిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న పంచాయతీలకు 10 వేల రూపాయలు, పెద్ద పంచాయతీలకు 25వేలు ఇస్తున్నట్లు తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకూ ఇదే విధంగా నిధులు ఇస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి

బహుమతులను అందజేయాలని తెలిపారు. ఆగస్టు 15న పాఠశాలల్లో స్వాతంత్ర్య సమరయోధులను, రక్షణ రంగంలో పని చేసిన వారిని, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

---------------------------

తెలంగాణను ఇకపై ఫ్యూచర్ స్టేట్ భవిష్యత్తు రాష్ట్రం అనే ఉపశీర్షికతో పిలవాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి.. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన కృత్రిమ మేధ వాణిజ్య రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కృత్రిమ మేధ కేంద్రం, నెట్ జీరో సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో భవిష్యత్తు రాష్ట్రంకు తెలంగాణ పర్యాయ పదంగా నిలుస్తుందని చెప్పారు. ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందని టెక్ యూనికార్న్ సీఈవోలకు తెలిపారు. పరిశ్రమలకు సరికొత్త భవిష్యత్తును కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

---------------------------

పూడికతీత చేపట్టిన ఇతర రాష్ట్రాల్లోని జలాశయాల్లో నీటి నిల్వ పరిస్థితులపై అధ్యయనం చేయాలని తెలంగాణా రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. ప్రాజెక్టుల్లో పూడికతీత ప్రక్రియపై నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం నిన్న హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించింది. తెలంగాణలో వివిధ ప్రాజెక్టుల్లో చేపట్టనున్న పూడికతీత వల్ల కలిగే ప్రయోజనాలు, తొలగించిన మట్టి, ఇసుక నిర్వహణ తదితర అంశాలపై ఈ నెల 14వ తేదీ కల్లా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉపసంఘం నీటిపారుదల, భూగర్భ గనులు, ఖనిజాల శాఖలను ఆదేశించింది. ప్రాజెక్టుల్లో పూడికతీతకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని, ప్రాజెక్టులకు ఎటువంటి నష్టం కలగకుండా ఉండేలా పూడికతీత పనులు చేపట్టాలని ఉప సంఘం సూచించింది.

గిరిజనుల అభివృద్ధి ప్రణాళికలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధంగా ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క అన్నారు. గిరిజన జీవనోపాధి పద్ధతులు సాధికారత, సమస్యలు అనే అంశంపై హైదరాబాద్‌లోని డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ఒకవైపు అభివృద్ధి జరుగుతున్నప్పటికీ తెలంగాణ మన్యం ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేవని చెప్పారు. గిరిజనుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న చట్టాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

---------------------------

కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ-ఏపీఆర్టీసీకి పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్, విజయవాడకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసులను అధికారులతో కలిసి నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఆర్టీసీ సంస్థను సంస్కరణలతో బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. మచిలీపట్నంలో మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా సీతారామాపురంలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త కుటుంబాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,శాంతి భద్రతల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. సీతారామాపురం గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరుగుతాయని తెలిసి కూడా అదనపు బలగాలను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని, సీతారామాపురం ఘటనపై హైకోర్టుకు వెళతామని తెలిపారు.

---------------------------

'మా తెలుగుతల్లికి మల్లెపూ దండ' అని తేట తెలుగులో రాసి.. తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించిన ప్రముఖ రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి ఈరోజు. ఈ సందర్భంగా తెలుగు సాహితీ రంగానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1914 ఆగస్టు 10వ తేదీన నాటి చిత్తూరుజిల్లా తిరుపతిలో జన్మించిన ఆయనకు తెలుగు రచయితల్లో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఉపాధ్యాయునిగా, పాఠశాల పర్యవేక్షకునిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన ఆంధ్రపత్రికలో కూడా పనిచేశారు. 1977 ఏప్రిల్ 8వ తేదీన సుందరాచారి తుదిశ్వాస విడిచారు. సుందరాచారి కలం నుంచి జాలువారిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతం 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' విందామా...

...వాయిస్ ...

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రోటోకాల్ విభాగం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 15న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని తెలిపింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని, జిల్లా స్థాయిలో మంత్రులు పతాకావిష్కరణ చేస్తారని వెల్లడించింది. కాకినాడలో ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ జాతీయ జెండాను ఎగురవేస్తారని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్ దినేశ్ కుమార్ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలియజేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి -ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో, కూటమి అభ్యర్థి ఎంపిక కోసం తెలుగు దేశం పార్టీ నాయకులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. నిన్న మంగళగిరిలోని టిడిపి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కూటమి అభ్యర్థి ఎంపిక కోసం వారి నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఉప ఎన్నికపై క్షేత్రస్థాయిలో పరిస్థితుల అధ్యయనానికి ఆరుగురితో కమిటీ వేశారు. త్వరలోనే విశాఖ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

=====================